క్లుప్తంగా

స్నేహితుల ఔదార్యం



వీపనగండ్ల: మండలంలోని సంపత్‌రావుపల్లికి చెందిన కృష్ణయ్య అనే పూర్వ విద్యార్థికి సహ విద్యార్థులు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థి కృష్ణయ్య అంగవైకల్యంతో బాధ పడుతుండగా అతడికి నగదు అందించడంతో పాటు మరో రూ.5 వేలతో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీకి ప్రీమియం చెల్లించారు. ఆర్థికసాయం అందించిన స్నేహితులకు కృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



పెబ్బేరు రూరల్: పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. విద్యార్థులు మాట్లాడుతూ శ్రీరంగాపురం పాఠశాల, పెబ్బేరులోని మోడల్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు అనుగుణంగా ఉదయం, సాయంత్రం సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమయానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. విద్యార్థుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న మేనేజర్ స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తాని హామీనిచ్చారు. విద్యార్థులు డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతిని నిర్మూలిద్దాం

చిన్నంబావి: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదన్నయాదవ్ మంగళవారం గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతోపాటు మండలంలోని బెక్కెం సర్పంచ్ పద్మమ్మ, గడ్డబస్వాపురం సర్పంచ్ సత్యారాణి కాంగ్రెస్ చేరారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి ఎంపీటీసీ సభ్యుడు ఓమేష్‌తో పాటు గట్టుకాడిపల్లికి చెందిన 30 మంది నాయకులు తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో క్యామ వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, సాయి చరణ్‌రెడ్డి, మానాజీపేట సర్పంచు సతీష్‌కుమార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేద్దాం



ఖిల్లాఘనపురం: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, సీనియర్ నాయకులు యాదయ్య, రాములు, శేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అల్లమాయపల్లి, ఖిల్లాఘనపురంలో మాదిగ విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ, బీ, సీ, డీ ఎస్సీ వర్గీకరణలో భాగంగా నిర్వహించే ఈ సభకు ముఖ్య అతిథులుగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు శేషయ్య, నాగన్న, శేషి పాల్గొన్నారు.

బెల్టుషాపుపై దాడి: కేసు నమోదు



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చందాపురంలో మంగళవారం రూరల్ ఎస్‌ఐ నాగన్న ఆధ్వర్యంలో బెల్టు షాపులపై దాడులు చేయగా 19 బీర్లు పట్టుబడ్డాయి. వీటి విలువ దాదాపు రూ.3వేలు ఉటుందని వారు తెలిపారు. షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బి.రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్యకర్తల కోసమే పోటీ

దేవరకద్ర: కార్యకర్తల కోరిక మేరకే దేవరకద్ర నుంచి నామినేషన్ వేశానని స్వతంత్ర్య అభ్యర్థి బోయరాము తెలిపారు. మంగళవారం ఆయన నామినేషన్ దాఖలు చేసిన తరువాత విలేకరులతో మాట్లాడారు. కురుమూర్తి, అమ్మాపూర్ గ్రామాల నుంచి బీజేపీ ఎంపీటీసీగా పదవిలో ఉన్నానని అక్కడ తనకు ఉన్న కార్యకర్తలు పోటీ చేయాలని సూచించడంతో నామినేషన్ వేశానని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల జాడేది?



పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

- కల్లాల్లోనే ధాన్యం
- త్వరగా ప్రారంభించాలని వేడుకోలు
- అకాల వర్షాలతో ఇబ్బందులు
- ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు

పాన్‌గల్: అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటల కోతలు ప్రారంభించి ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చినా.. నేటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మండలంలో వారం రోజుల కిందట నుంచి వరి పంట కోతలు ప్రారంభించారు. మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ వంటి రైతు సహకార సంఘాలకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం అప్పగించనుంది. సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కేంద్రాల ప్రారంభానికి జాప్యం చేస్తుండటంతో వాతావరణ మార్పుల కారణంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులంతా ఎన్నికల సందడిలో..

ప్రతి ఏడాది ఈ సమయానికి అవసరమున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం అధికారులు, నాయకులు ఎన్నికల హడావిడిలో ఉండటంతో అనేక గ్రామాల్లో పంటలు చేతికి వచ్చిన ధాన్యం కేంద్రాలు ప్రారంభం కావడంలేదు.

ధాన్యం కాపాడుకోవడం ఇబ్బంది

కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు కత్తిమీద సాములా మారింది. మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తుండడంతో చేతికొచ్చిన ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు చలికి ధాన్యం వద్ద కాపలా కూడా ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి కేంద్రాలను జాప్యం లేకుండా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

మండలాల వారీగా..

మండలం	వరి(ఎకరాలు)	ప్రారంభించే కేంద్రాలు	
పాన్‌గల్	17,500	14 ఐకేపీ	16 పీఏసీఎస్
వీపనగండ్ల	14,175	10 ఐకేపీ	07 పీఏసీఎస్
చిన్నంబావి	6,496	04 ఐకేపీ	04 పీఏసీఎస్

కేంద్రాలను ప్రారంభించాలి



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే లోపు కొనుగోళ్లు ప్రారంభిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో ధాన్యం కాపాడుకోవడం, కాపలా కాయడం కష్టం మారింది. దీనికి తోడు మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు వస్తుండడంతో టార్పాలిన్ కవర్లు లేక ధాన్యం తడుస్తుందేమోనని భయమేస్తుంది.

– లింగాల స్వామి, రైతు, పాన్‌గల్.

అధికారులు స్పందించాలి



అధికారులు స్పందించి జాప్యం చేయకుండా వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల ఇబ్బందులు తొలగించాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి వారం రోజులు కావస్తున్నా నేటికీ కేంద్రాల ఏర్పాటులో జాప్యం తగదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి.

– బాల్యానాయక్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశానుసారం మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చిన విషయం మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులతో చర్చించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

– సక్రూనాయక్, ఏపీఎం, ఐకేపీ, పాన్‌గల్

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి



కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న తల్లి బిచ్చమ్మ

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ఆయన తల్లి బిచ్చమ్మ పట్టణంలోని 8, 9 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మరోసారి హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. ఆమె వెంట నాయకులు ముస్తఫా, ఫయాజ్, విశ్వాస్, సుల్తాన్ తదితరులున్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

పాన్‌గల్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని ఎంపీ పోతుగంటి రాములు కోరారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు.. తర్వాత అభివృద్ధిని గమనించాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మరోమారు గెలిపించాలనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాముయాదవ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేవాభావంతో వైద్యం అందించాలి



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామయ్య



వీపనగండ్లలో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

వీపనగండ్ల: సేవాభావంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వైద్య సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారి లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యం పనికిరాదని, మాతాశిశు సంరక్షణ, గర్భిణుల రిజిస్ట్రేషన్, టీబీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు వంటి విషయాలపై వైద్య సిబ్బంది చురుకుగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశాలు అందుబాటులో ఉండాలి

పాన్‌గల్: ఆశా కార్యకర్తలు వారికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సిబ్బందితో సమన్వయంతో పనిచేసుకొని ఆరోగ్య పథకాలు, వైద్య సేవలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు నిర్దేశించిన నెలవారీ లక్ష్యాలు, టీబీ, మాత, శిశు సంరక్షణ, గర్భిణుల నమోదు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో పాటు పీహెచ్‌సీ ద్వారా అందుతున్న సేవలు, ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాలను గ్రామాల్లో వివరిస్తూ వారు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు శ్రీనివాస్, సుమనశ్రీ, హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా జూరాల ప్రాజెక్టు రహదారి



రహదారిపై ఏర్పడ్డ గుంతలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై గల బీటీ రహదారి అధ్వానంగా మారినా సంబంధిత ప్రాజెక్టు అధికారులు పట్టించుకోవట్లేదు. జూరాల ప్రాజెక్టు పై నుంచి జోగులాంబ గద్వాల జిల్లాకు రహదారి సౌకర్యం ఉండడంతో వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఈ క్రమంలో బీటీ రహదారి దెబ్బతిని గుంతలమయమవుతున్నా అధికారులు ఏమాత్రం స్పందించక పోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడిజిల్లాకే వరప్రదాయిని అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రహదారికి మరమ్మతు చేయడంలో ప్రభుత్వం చొరవచూపక పోవడం శోచనీయం అని ప్రాజెక్టు సందర్శన కోసం వస్తున్న ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి



సీవీరామన్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న కవులు, నాయకులు

వనపర్తి టౌన్: విద్యార్థులు శాస్త్రవేత్తల మార్గంలో నడిచేందుకు ప్రయత్నిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సీవీ రామన్ 135వ జయంతి, మేడమ్ క్యూరీ 156వ జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. సీవీ రామన్ (చంద్రశేఖర్ వెంకటరామన్) అనిపెట్టిన రామన్ ఎఫెక్ట్‌కు 1930 సంవత్సరంలో నోబెల్ వచ్చిందని, భౌతిక శాస్త్రవేత్తగా భారతదేశంలోని ఎంతో మంది శాస్త్రవేత్తలకు ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. 1954వ సంవత్సరంలో సీవీ రామన్‌ను భారత ప్రభుత్వం భారతరత్నతో సత్కరించిందని గుర్తుచేశారు. మేడమ్ క్యూరీ రెండుసార్లు నోబెల్ బహుమతిని దక్కించుకుందని, రేడియోధార్మిక ఐసోటోపులను ఉపయోగించడంతో నియోజిక చికిత్సలో ప్రపంచంలో మొట్టమొదటిగా అధ్యాయనాలు జరిపిన శాస్త్రవేత్తగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, మండ్ల దేవన్న నాయుడు, కావలి బాలస్వామి నాయుడు, గంధం నాగరాజు, తగువుల వెంకటస్వామి, బాలేమియా, భద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు బంగారు భవిష్యత్

చిన్నంబావి: యువత భవిష్యత్ మారాలంటే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ఆయన మండలంలోని వెలగొండలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సాక్షి, నెట్‌వర్క్: వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా తూడి మేఘారెడ్డిని ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అవినీతి రహిత పాలన కావాలంటే మేఘారెడ్డిని గెలిపించాలని కోరారు.

నగదు చోరీ

ఖిల్లాఘనపురం: రోడ్డుపై దొరికిన ఏటీఎం కార్డుతో గుర్తు తెలియని వ్యక్తి రూ.51,500 నగదును విత్‌డ్రా చేసిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాలు.. మండలంలోని మానాజీపేటకు చెందిన అంజనేయులు ఒకే బ్యాంకుకు చెందిన ఖాతాకు అవసరం నిమిత్తం రెండు ఏటీఎం కార్డులు తీసుకున్నాడు. వాటిలో ఓ కార్డును ఇటీవల పోగొట్టుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి ఆ కార్డును ఉపయోగించి అంజనేయులు ఖాతాలో నుంచి రూ.51,500 నగదును విత్‌డ్రా చేసుకున్నాడు. ఈ విషయమై మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని, కొత్తకోటలో ఉన్న ఏటీఎం మిషన్‌లో నగదు డ్రా చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

ఇంటింటి ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆత్మకూర్, అమరచింత మండలాల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్ కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి, మాసన్న, శ్రీనివాసులు, భరత్ పాల్గొన్నారు.

బీసీ గర్జనకు తరలిన నాయకులు

హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీసీ గర్జన సభకు అమరచింత మండలం నుంచి బీజేపీ బీసీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నరాల నారయణ, మీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఖిల్లాఘనపురం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 10 ట్రాక్టర్లతో పాటు ఒక హిటాచీని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీహరి వివరాల మేరకు.. ఖిల్లాఘనపురం మండలంలోని అంతాయపల్లి వాగులో మంగళవారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో నింపుతున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. అంతాయపల్లికి చెందిన 10 ట్రాక్టర్లలో హిటాచీతో ఇసుకను నింపుతుండగా, పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుక ట్రాక్టర్లు, హిటాచీని పోలీస్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని నాగమ్మతండా శివారులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకుని కేసు నమోదు చేశామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు. వివరాల ప్రకారం.. కాశీంనగర్ ఎర్రగట్టు వాగు నుంచి ముడావత్ మురళినాయక్ ట్రాక్టర్‌తో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాడు. నాగమ్మతండా శివారులో పోలీసులు ఆపి అనుమతి పత్రాలు చూపించమని అడుగగా.. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బాణసంచా సీజ్

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని శంకర్ గంజ్‌లో గల ఓ దుకాణంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడి చేసి అనుమతి లేని బాణసంచాను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన అన్వేష్ శంకర్‌గంజ్‌లోని దుకాణంలో అనుమతి లేకుండా బాణచంచా నిల్వ ఉంచి అమ్ముతున్నాడనే సమాచారం రావడంతో దుకాణంపై ఆర్‌ఐ మధు, పోలీసులు దాడి చేసి నిల్వ ఉన్న బాణసంచాను సీజ్ చేశారు. వాటి విలువ దాదాపు రూ.26,800 ఉంటుందన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తారునాయక్ (37) కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉపాధ్యాయుడి అకాల మరణంపై ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాలు, గిరిజన ఉద్యోగుల సంఘాల నాయకులు, గ్రామస్తులు సానుభూతిని తెలిపారు. మృతుడి స్వస్థలం కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం.

కంచిరావుపల్లి పాఠశాలలో బోధన సాగేదెలా?



కంచిరావుపల్లి పాఠశాలలో ప్రార్థన సమయంలో హాజరైన ఒకే ఉపాధ్యాయుడు

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను తాత్కాలిక పద్ధతిపై వేరే పాఠశాలకు కేటాయించారు. ఆ ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలకు పంపించాలని కోరుతూ ఎస్‌ఎంసీ చైర్మన్ అలివేల మంగళవారం మండల విద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 81 మంది విద్యార్థుల ఉండగా.. హెచ్‌ఎంతో కలిపి ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో ఇద్దరిని వేరే పాఠశాలకు తాత్కలికంగా పద్ధతిపై వేరే పాఠశాలకు కేటాయించడంతో.. ముగ్గురితో బోధన సాగేదెలా అని ప్రశ్నించారు. అందులో ఒక ఉపాధ్యాయురాలు మెడికల్ లీవ్‌లో ఉన్నారని, ప్రస్తుతం ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. వారిలో ఒకరు సెలవు పెట్టినా పాఠశాల ఎలా నడుస్తుందని, విద్యార్థులకు ఎలా చదువు నేర్పుకుంటారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామ సర్పంచ్ సుజాత చాలాసార్లు విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులను పంపించాలని, లేని ఎడల పాఠశాలకు తాళం వేసి విద్యార్థులతో కలిసి ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన శ్రీనివాసులు రేవల్లి మండలం ఎస్సీ హాస్టల్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న యూనియన్ సంఘం మండల నాయకులు మంగళవారం జిల్లా ఏరియా ఆస్పత్రి మార్చురీలో మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాసులు గతంలో మండలంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా రేవల్లి మండలం ఎస్సీ హాస్టల్‌లో హెల్పర్‌గా బదిలీ అయ్యారు. కార్యక్రమంలో సురేష్, రాజు, మండల రెవెన్యూ సిబ్బంది రమేష్, నర్సింహ, రామకృష్ణ, బషీర్, నాగరాజు, మల్లేష్, చందూ, రేవల్లి మండల వార్డెన్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల పరామర్శ

రేవల్లి మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన శ్రీనివాసులు కుటుంబాన్ని మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కుర్మయ్య, అరుణమ్మ, పెద్దహన్మంతు, చిన్నకుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన హెచ్‌ఎం కురుమయ్య ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో కొత్తకోట ఉర్దూమీడియం పాఠశాలకు బదిలీపై వెళ్లారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి హెచ్‌ఎంను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాఠశాలకు అతడు చేసిన సేవలు, విద్యార్థులకు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేందర్‌గౌడ్, ఎల్లస్వామి, కవిరాజుగౌడ్, విజయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

